# సమస్యాపూరణం

**పారాణి** రంగరించిన పచ్చి పాల లాంటి దేహఛాయ, చారెడు కళ్లు, బారెడు జడ, నున్నని చెక్కిళ్లు, సన్నని నడుము, నడుము మోయలేనంటున్న స్తన మండలం... ఇవన్నింటితో పాటు మాలతి బి.యస్సీ డిగ్రీ కూడా సొంతం చేసుకుంది.

చూపుకు మల్లెతీగలాగున్నా కరాటేలో ప్రావీణ్యం సంపాదించింది. కన్ను కొట్టిన కాలేజీ కుర్రాడి గల్లాబట్టి ఒళ్లు హూనం చేసిన అనుభవముంది. పెళ్లి చేసుకొని పెనిమిటికి తన అంద చందాలతో విందు చెయ్యాలనే కోరిక ఇటీవలే బలపడింది.

నీలవర్ణం, గోలా మొహం, కత్తెర మీసం, మెత్తని మనసు గల మధుసూదన్‌కు ఎలక్ట్రికల్ డిప్లమాతోపాటు పదేళ్లు దుబాయ్‌లో పంజేసి రెండు చేతులా సంపాదించిన అనుభవముంది. యన్. ఆర్.ఐ. బాంకు ఎకౌంట్‌లో బోలెడంత బాలెన్సుంది. బంగారాన్ని కొంత నగల రూపంలో మరికొంత బిస్కెట్ల రూపంలో చలాకీగా సర్దుకొని ఈ మధ్యనే స్వదేశం వచ్చాడు - వచ్చిన నెలలోనే తనకనుభవమున్న ఎలక్ట్రికల్ షాపు తెరిచాడు. శక్తియుక్తులన్నీ ప్రయోగించి అమ్మకాలను తారాస్థాయికి పెంచేశాడు. గుమాస్తాల మీద అజమాయిషీ చేస్తూ ఇక్కడ కూడా ఎడాపెడా సంపాదిస్తున్నాడు.

"బ్రహ్మచారి ముదిరినా, బెండకాయ ముదిరినా పనికిరావురా నాయనా !" అంటూ ప్రారంభించిన అమ్మానాన్నల పోరు భరించలేక పెళ్ళికి సరెండరైపోయాడు.

చిలిపి చూపుల మాలతి, చలాకీ మాటల మదుసూదన్ పెళ్లి చూపుల్లోనే ముసి ముసి నవ్వులు పంచుకొని మనసులిచ్చిపుచ్చుకున్నారు. అగ్ని సాక్షిగా ఏడడుగులు నడిచి మూడు ముళ్లతో ఆలూమగలయ్యారు.

కోరుకున్న భర్త కౌగిట్లో కోర్కెల మూట విప్పి సుఖ సంతోషాలు పాలు పంచుకొనే మొదటి రాత్రి... దివి నుండి భువికి దిగి వచ్చిన రంభలా తయారైంది మాలతి. అపర నలకుబేరుడిలా అంతకు ముందే తయారైపోయాడు మధు. గుండెలనిండా గుస గుసలు. బుగ్గలనిండా సిగ్గులు సింగారించుకొని మాలతి పాల గ్లాసుతో ప్రవేశించింది గదిలోకి. అడుగులో అడుగేస్తూ మయూరిలా, మత్తగజంలా దరిజేరింది. మత్తెక్కించే అగరొత్తులు, మైమరపించే అత్తరు వాసనలు, మెత్తని పరుపు, పరుపు నిండా రేకులు విప్పిన మల్లెలు... రా రమ్మంటున్నాయి.

మధుసూదన్ ఎదురొచ్చి పెదాల మధువును జుర్రుకుంటాడని ఆశించింది. ఒళ్లంతా

అల్లుకుపోతాడని ఊహించింది. ఆహా ! క్షణంలో స్వర్గద్వారాలు తట్టడం ఖాయం... అనుకుంటూ నుంచుంది.

కాని... ఏదీ ! మధుసూదన్ కదలడేమీ ? కాళ్లు బార్లా చాపి మంచమ్మీద కళ్లు మూసుకున్నాడు.

"అమ్మదొంగా ! ఈ దొంగాటకం నా దగ్గరనా !" గలగలా నవ్వింది. చక్కిలిగింతలు పెట్టింది. చెంపలమీద చిటికేసింది. కళ్లు సగం తెరిచి మూసుకున్నాడు. పక్కకు ఒత్తిగిలబడుతూ.

"నిద్ర ముంచుకొస్తూంది మాలతీ ! నా కిష్టమైనవి నేను తిన్నాను. నీ కిష్టమైనవి తిని హాయిగా పడుకో !" ఆవులించాడు.

మాలతి గుండె గుభేల్ మంది.

వెంటనే సర్దుకుంది. "మొదటి రాత్రంటే ఇదేనా మధూ ?" ముందుకు వంగి పెదాలతో పెదాలందుకుంది. నరాలు జివ్వుమన్నై. కరెంట్ షాక్ తగిలినట్టు లేచి కూచున్నాడు.

"మొదటి రాత్రి ఆనందంగా గడపాలి గదా ! హాయిగా పడుకున్నాను. నువ్వు కూడా దర్జాగా పడుకో మాలతీ !" పక్కకు జరిగాడు. ఆ తర్వాత గురక వినిపించింది.

రెండోరోజు రాత్రి... మాలతి ముందే గదిలో దూరింది. ఆవులిస్తూ వచ్చాడు మధుసూదన్. సిగ్గులన్నీ మూలకు నెట్టేసి ముద్దుగా కౌగిలించుకుంది. మధుసూదన్ కేదోలాగుంది. నరాల్లో అర్థం కాని అలజడి. అంతా అయోమయం. భుజాల మీద చేతులేసి కళ్లలోకి చూసింది మాలతి. ఎక్కడెక్కడో తడుముతున్న ఆకలి చూపులు... దాచుకున్న ఆస్తులనెవరో దోచుకుపోతున్న ఫీలింగ్ అతనిది.

"అమ్మో ... ఇదేమిటీ ... హాయిగా పడుకుందాం. టైం వేస్ట్ చెయ్యొద్దు మాలతీ !" విడిపోయి మంచమ్మీద ఒరిగిపోయాడు. మాలతి ప్రయత్నం బూడిదలో పోసిన పన్నీరైంది.

మూడోరోజు పొద్దుట్నుంటే ఆడపడచుల ఆగడాలు..

"గడుసు వదిన అలిసి పోయినట్టుందే !"

"పాపం ! రాత్రంతా నిద్రలేదు గదా !"

చెంపల మీద చిటికెలు... పరాచకాలు... వాళ్లకేం చెప్పాలో, ఎలా చెప్పాలో అర్థంగాక ఏడుపొచ్చినంత పనైంది.

మర్నాడు సిగ్గు విడిచి అడిగింది –

"శోభనమంటే ఏమిటో తెల్సా మధూ ?"

"మనకు శోభనమై మూడ్రోజులైంది. ఇంకా తెలీకపోవడమేమిటీ ? వధూవరులు శోభాయమానంగా తయారై సుశోభితంగా అలంకరించిన ఒకే మంచమ్మీద ఆదమరచి నిద్రబోవడం..." నవ్వేశాడు.

నవ్వాలో ఏడ్వాలో అర్థం గాలేదు మాలతికి.

"సెక్సంటే ఏమిటో తెలుసా ?"

"అబ్బో ... ! నెత్తి మీద బాంబు పేలినట్టు హడలిపోయాడు". సెక్స్ మాటెత్తినా, ఆ సాహిత్యం, చదివినా గల్ఫ్ కంట్రీస్‌లో జైల్లో ఫిక్స్ చేస్తారు తెల్సా ! దాని గురించి తెలుసుకోక పోవడమే మేలు. రేపట్నించి హనీమూన్ కెళ్లాలి గదా... హాయిగా పడుకో !

అతని గురించి అర్థమై పోయింది.

హనీమూన్‌లో మొదటిరోజు తిరుపతి. తిరుమలేశునికి చేతులు జోడించి మొక్కుకుంది. రెండోరోజు మద్రాసు. ఆ తర్వాత... ప్రకృతి ఒడిలో పరవశిస్తున్న ఊటీలో నైట్ హాల్ట్. చలిపులి ఎముకల్ని కొరికేస్తుంది. పచ్చని ప్రకృతి ఒడిలో పచ్చడం కప్పుకుని వెచ్చగా పడుకున్నాడు. చెలరేగిన కోర్కెల్ని కొంగుకు ముడేసుకోక తప్పలేదు.

బేలూరులో... వాతావరణం ప్రశాంతంగా ఉంది. చెన్న కేశవాలయ ప్రాంగణం ఆహ్లాదాన్నిస్తుంది. అది దేశీయ కళాసంపద కాణాచి. అమరశిల్పి జక్కన్న అహోరాత్రాలు శ్రమించి ముందు తరాల కోసం సృష్టించిన శిల్పారామం. ప్రతి అంగుళం మధురభావ నిష్యందనా స్యందనం. రాశులు బోసిన అందాలు, అప్సరసల్ని తలదన్నే సాలభంజికలు, నాయకీ నాయకుల శృంగారకేళీ విలాసాలు... దేశ విదేశీ యాత్రికుల గుండెల్లో గుసగుసలు రేపే సజీవశిల్పాలు.

ఓ కళాఖండం ముందు కాళ్ళకు బ్రేకులు పడినై. నాయకీ నాయకులు... శరీరమ్మీద నూలు పోగు కూడా లేదు. ఒకరి కౌగిట్లో ఒకరు కరిగిపోతున్నారు. మరో కళాఖండము... ముద్దులు మూట గట్టుకుంటున్నారు... మధుసూదన్ అంతరాలల్లో గందరగోళం. ఎన్నడూ ఊహించని నరాల స్వరాలు. ఏదో గిలిగింత... మరో కోరిక...

"ఇదిట్లా ఉందేమిటీ ?" గైడు నడిగాడు విస్మయంగా.

"ఔన్సార్ !" గైడు కర్రతో శిల్పాలను చూపిస్తున్నాడు. "దేవాలయాలు మానవ జాతికి సర్వాంగీణ వికాస కేంద్రాలు. శృంగారం మనిషి జీవితంలో ముఖ్య భాగం గదా ! భార్యాభర్తలు ఏకాంతములో ఒకటై... ఒకరిలో ఒకరు లీనమై స్వర్గసుఖాలనుభవిస్తారు గదా ! శృంగారం... దటీజ్ సెక్స్ గురించి అవగాహన లేనివారికివి దారి చూపిస్తాయి..."

బెంగుళూరు చేరేసరికి రాత్రైంది.

"అసలీ శృంగారమంటే ఏమిటి మాలతీ !" అంతరంగ ధ్వనులకు కారణం వెతుక్కుంటూ అడిగాడు. తనకు తెలియనిదేదో ఉందని అర్థమైనా పెళ్లాం ముందు బయటపడితే చులకనై పోతానేమోననే కాంప్లెక్స్ మరోవైపు.

"అది కూడా ఒక సెక్స్..." చెంపలందుకోబోయింది.

"వామ్మో ! ఇదేమిటీ... ఊహూ !" ఏదో గుంజాటన. ఏదో తపన.

"ఏమో మాలతీ... అంతా అయోమయం..." ఒళ్లు విరిచి విడిపోయాడు.

ఇప్పుడెట్లా... ఏం చెయ్యాలి ? మాలతి తలనిండా స్నానం చేసి నిలువెత్తు అద్దం ముందు నుంచుంది.

పిచ్చి మధూ ! నువ్వు సుఖపడవు. నన్ను సుఖ పెట్టవు... మనసు బావురుమంది. దాంతోపాటు పట్టుదల పెరిగింది.

శృంగార యాత్రలో చివరి మజిలీ ఖజురహో.

చంద్రవంశపు రాజుల శృంగార సృష్టి. బుందేల్‌ఖండ్ రసపుత్రుల శౌర్య ప్రతాపాలకు, రసరాజుల రాసకేళికి ప్రత్యక్ష నిదర్శనము. దేవాలయాల గోడలనిండా - వాత్స్యాయన కామ సూత్రాలకు భాష్యం చెప్పే శిల్ప సౌందర్యాలు !

కాఫీ టిఫిన్లు పూర్తి జేసి దేవాలయ సముదాయానికి చేరుకున్నారు. చేతిలో చెయ్యేసి నడుస్తున్నారు. కందరీయాలయం, లక్ష్మణ్ గుడి, చిత్ర గుప్తాలయం, విశ్వనాథాలయము, జగదాంబాలయము... ఎక్కడ చూసినా దిగంబర శిల్పాలే.

గంధర్వుల కామకేళీ విలాసాలు... ఒకటి కొకటి పోటీ పడుతున్నై. శృంగార లోకములో సిగ్గూ, బిడియాలను సుదూరంగా తరిమేసే శక్తి స్వరూపాలు... సజీవ మూర్తులు... దిగంబర శిల్పాలు.

అదో రంగుల హంగుల లోకం. వయసు మళ్లిన వారిని సైతం చెంగు చెంగుమనిపించే మహత్తర సృష్టి కావ్యం.

లక్ష్మణ గుడిలో ఓ శిల్పం ముందాగారు. సుందరాంగుని కౌగిట్లో సుందరి... ఆవిడ బాహుద్వయం అతని మెడలో హారమైంది. అధరోష్ఠాలు, కటి భాగాలు అపాదమస్తకం హత్తుకు పోయి... ఇద్దరు కలిసి ఒకటైపోయారు. దేశ విదేశీ జంటలు ఆసక్తిగా చూస్తున్నాయి. రతీ మన్మథుల రాసకేళీ విలాసాలు మధుసూదన్‌లో సంచలనం రేపినై. అతని నరాలు వింత స్వరాలు పలుకుతున్నై. తెగింపు బలపడుతోంది. అవయవాల్లో వేడి... చూపుల్లో వాడి... కళ్లల్లో కదిలే కోరిక... చూపులు మాలతివైపు మళ్లినై. ఆవిడ పరిస్థితి కూడా అంతే... ను సిగ్గుల భారాన్ని మోయలేక ఆకలిగా చూసిందతన్ని.

"ఇదో వండర్ వరల్డ్... ప్రాక్టికల్‌గా ఇదంతా..." భుజమ్మీద చెయ్యేసి గట్టిగా హత్తుకున్నాడు.

ఆహా ! ఎంత కమ్మగా ఉంది.

"సృష్టి కార్యానికి ఆడంబరాలుండవు మధూ !" అర్థ నిమిలిత నేత్రాలతో చూస్తూంది "నాగరికత నేర్చిన మనిషి ఎన్ని డ్రెస్సులేసుకున్నా.... ఏకాంతములో ఆలూమొగలిలాగే ఉంటారు. దీంతోనే స్వర్గ సుఖాలందుకుంటారు... ఇదే సెక్స్... దీన్నే సృష్టి కార్యమంటారు... అతని నడుమును చుట్టేసి భుజమ్మీద తలానించింది."

అద్భుతం... అమోఘం... మనుషులిలాగని ఎన్నడూ వినలేదు... కనలేదు... నర నరాన విద్యుత్తు ప్రవహిస్తోంది.  కోరిక... మాలతి నడుమ్మీద చెయ్యేసి దగ్గరగా హత్తుకున్నాడు.

కళ్లూ కళ్లూ కలిసినై.  కాంతి పుంజాల పరావర్తనం కొత్త అనుభవానికి ఉసిగొల్పుతూంది.

మాలతి అపురూప లావణ్యవతిలా కన్పించింది.  ... దోర మాగిన మామిడిపండు దోసిట్లో కొచ్చింది... చేజారకూడదు...

"రతీ మన్మథుల రాసకేళీలివేనా మాలతీ ?" పెదాలు మత్తుగా గమ్మత్తుగా కదులుతున్నై.

"అవును... ప్రకృతి పురుషుల మేలు కలయిక శృంగారమయం... ఈ ప్రపంచమంతా శృంగారమే మధూ ..."

విశ్వకళా సృష్టిలో వినూత్న ప్రయోగాలు.

"మనం లాడ్జి కెల్దామా మాలతీ !"

"పద ... ఆటోలో వెళ్దాం ..."

గదిలో దూరగానే తలుపులు మూసుకున్నై.

సమస్య శాంతియుతంగా పరిష్కారమైంది.  దివి నుండి భువికి స్వర్గం దిగి వచ్చింది.

**25-6-1999**

**'ఆంధ్రజ్యోతి' సచిత్ర వారపత్రిక లో**

**ప్రచురితమైంది.**

